# అంతా మంచికే



అనగా అనగా ఓ రాజుగారు. ఆయనకో మంత్రిగారున్నారు. అదేం చిత్రమోగానీ, ఆ రాజుకూ, మంత్రికీ కూడా చాలా కాలం సంతు లేదు. పిల్లల కోసం వారు చేయని దానాలు, అనుష్ఠించని వ్రతాలూ చూడని క్షేత్రాలూ లేవు. ఆఖరికి వారిద్దరికీ ఒకటి రెండు రోజుల తేడాతో కొడుకులు జన్మించారు. తనకు కొడుకు పుట్టి, రాజుగారికి కూతురు పుడితే రాజుగారితో వియ్యంపొంది, రాజ్యాన్ని కాజేదామని మంత్రిగారు అనుకొన్నారు. కానీ అలా జరగనందుకు మంత్రిగారు విచారించారు. ఆయన తన కొడుకు దురదృష్టాన్ని గురించి చాలా దుఃఖ పడ్డారు కూడా.

రాజు కొడుకును ఏదో విధంగా తొలగించడానికి మంత్రిగారు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అదృష్టవశాత్తు వాటిలో ఏవీ ఫలించలేదు.

రాజు కొడుకు, మంత్రి కొడుకూ పెరిగి పెద్దవారయ్యారు రాజు కొడుకు మీద మంత్రిగారబ్బాయికి లోలోపల చాలా ద్వేషం పేరుకు పోయింది.

ఒకసారి వారిద్దరూ అరణ్యానికి వేటకోసం వెళ్లారు. ఒక చోట మకాం వేశారు. రాజు కొడుకూ మంత్రి కొడుకూ జంతువులను వేటాడుతూ అరణ్యాలలో చాలా దూరం వచ్చేశారు. ఇద్దరూ అలసిపోయారు. ఇద్దరిలోను మంత్రి కొడుకు మరీ డీలా పడిపోయాడు. రాజు కొడుకును పిలిచి తనకు మంచినీరు కావాలన్నాడు.

రాజుగారబ్బాయి, ఓ పాడు పడిన నూతిని కనుక్కొన్నాడు. అందులోకి చూస్తూ ఉంటగా మంత్రి కొడుకు వెనుకపాటుగా వచ్చి, రాజుగారబ్బాయిని నూతిలోకి తోసేశాడు. పీడవదిలిపోయిందనుకొన్నాడు. అడవిలో క్రూరమృగాలు చంపేశాయని అబద్ధమాడ వచ్చునని అనుకొన్నాడు.

తీరా మకాం దగ్గరకు బయలుదేరే వేళకు, అతన్ని దొంగలు పట్టుకొన్నారు. ఆ రోజున వారికి పండుగ కూడా. ఆ పండుగనాడు నరబలినివ్వడం వారికి రివాజు.

ఆ రివాజు ప్రకారం మంత్రి కొడుకును పట్టుకెళ్ళారు. తతంగాలన్నీ ముగిశాక చూస్తే మంత్రి కొడుకు చేతికి రెండు వేళ్ళు లేవు. అవయవాలు తిన్నగా లేని వారిని బలి చేస్తే దేవికి కోపం వస్తుందన్న అనుమానంతో మంత్రికొడుకును విడిచిపెట్టేశారు.

మంత్రి కొడుక్కి జ్ఞానోదం యఅయింది. గబగబా పాడుబడిన నూతి దగ్గర కొచ్చి, రాజు కొడుకును వెలికి తీశాడు. జరిగినదంతా చెప్పాడు. రాజు కొడుకు నవ్వాడు.

"నువ్వు చాల మంచిపని చేశావు తమ్ముడూ. అలా బావిలోకి తోయకపోతే నా అవయవాలన్నీ సరిగ్గా ఉన్నాయి కనుక దేవికి నన్ను బలి చేసి ఉండేవారు. నువ్వు నాకు మహోపకారం చేశావు సుమా!" అన్నాడు రాజు కొడుకు.

—o—